క్లుప్తంగా

11న మేరీమాత యాత్ర మహోత్సవం

ప్రత్తిపాడు: స్థానిక మరియగిరిపై ఈనెల 11వ తేదీన మేరీమాత యాత్ర మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆర్‌సీఎం చర్చి కమిటీ సభ్యులు తెలిపారు. 11వ తేదీ శనివారం ఉదయం మరియగిరిపై భీమిలి మైనర్ సెమినరీ రెక్టర్ రెవరెండ్ ఫాదర్ డి.పరంజ్యోతి, ఇతర గురువులతో సమష్టి దివ్య పూజాబలిని నిర్వహిస్తారు. మధ్యాహ్నం స్థానిక ఆర్‌సీఎం చర్చి నుంచి మేరీ మాత తేరును మరియగిరి వరకూ పుర ప్రదక్షిణ నిర్వహిస్తారు. స్థానిక ఆర్‌సీఎం చర్చి రెవరెండ్ ఫాదర్ కె.చిన్నప్ప ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో క్రైస్తవ సోదరులు, మతకన్యలు పాల్గొని, మేరీమాత యాత్ర మహోత్సవాన్ని విజయవంతం చేయాలని చర్చి కమిటీ సభ్యులు కోరారు.

ఆధార్ అప్‌డేట్‌తో విద్యార్థులకు మేలు


ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ మేరీ

తుని రూరల్: గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ అప్‌డేట్ కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమని హంసవరం సర్పంచ్ రాయి మేరీ అన్నారు. గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. సొంత స్థలాల్లో నిర్మిస్తున్న గృహాలను పరిశీలించి, రుణాలు, రాయితీపై అందిస్తున్న మెటీరియల్ అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా పంచాయతీ సిబ్బందితో శ్మశాన వాటికను శుభ్రం చేయించారు.

పౌష్టికాహారం పంపిణీ


ఏలేశ్వరంలో పౌష్టికాహారం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

ఏలేశ్వరం: పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పౌష్టికాహారం అందజేశారు. స్థానిక 7, 9 వార్డుల్లో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దిలబర్‌హుస్సేన్, వైఎస్సార్ సీపీ నేత అలమండ వీరరాఘవస్వామి చేతుల మీదుగా పౌష్టికాహారం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని విధిగా లబ్ధిదారులకు అందజేశారు. నిబంధనలకు అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాలు సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పైల విజయ్, కడింశెట్టి వాసు, పైల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక 17వ వార్డులో కౌన్సిలర్ బదిరెడ్డి వెంకటరమణమ్మ, 8వ వార్డులో వైఎస్సార్ సీపీ నేత దేగల వెంకటరమణ పౌష్టికాహారం అందజేశారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


గౌరంపేటలో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే అందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు అన్నారు. గౌరంపేట గ్రామంలో బుధవారం పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెత్తను తొలగించారు. డ్రైన్లలో పూడికను తీయించారు. గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. దోమల మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏసుబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

పీహెచ్‌సీ తనిఖీ

జగ్గంపేట: కాట్రావులపల్లి పీహెచ్‌సీలో విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో మందులు, మౌలిక వసతులు, రోగులకు అందుతున్న సేవలు గురించి వైద్యాధికారి రాజశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సత్య కిషోర్, రమేష్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు.

వ్యక్తి అదృశ్యం


బంటుపల్లి దుర్గ

ఏలేశ్వరం: యర్రవరం గ్రామానికి చెందిన బంటుపల్లి దుర్గ అనే వ్యక్తి అదృశ్యమైనట్టు ఫిర్యాదుపై బుధవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై జి.సతీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 23న కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామంలో తన భార్య రాజేశ్వరీని తీసుకువస్తానని చెప్పి వెళ్లిన దుర్గ ఇప్పటి వరకు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సెల్ నంబర్లు 9440904835, 9440796530 సంప్రదించాలని కోరారు.

టెన్షన్.. టెన్షన్..

- విద్యార్థులకు దినదిన గండం
- చదువుకోవాలంటే హైవే దాటాల్సిందే
- అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కోరుతున్న తల్లిదండ్రులు


ధర్మవరంలో హైస్కూల్‌కు వెళ్లేందుకు హైవే దాటుతున్న విద్యార్థులు

ప్రత్తిపాడు రూరల్: విద్యార్థులకు చదువు ప్రాణసంకటంగా మారింది. గ్రామానికి హైస్కూల్‌కు మధ్యలో హైవే ఉండడంతో దినదిన గండం మారింది. ప్రస్తుతం పోలీసుల సహకారం లేనిదే విద్యార్థులు హైవే దాటలేని పరిస్థితి నెలకొంది. రోడ్డు దాటే క్రమంలో జరగరానిదేదైనా జరిగితే అయ్యో పాపం అనడం మినహా చేసేది ఏమీ ఉండదు. ఆ పరిస్థితి తలెత్తక ముందే అధికారులు స్పందించి ఒక పరిష్కారం చూపాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

అసలు విషయానికి వస్తే... ప్రత్తిపాడు మండలం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులు 16వ నంబరు జాతీయ రహదారి దాటాల్సి ఉంది. ఇది విద్యార్థులకు పెద్ద సమస్యగా మారింది. ప్రస్తుతం ఈ పాఠశాల విద్యార్థులు ఉదయం, సాయంత్రం పోలీసుల సహకారంతో రోడ్డు దాటుతున్నారు. విద్యార్థులు, ప్రజల సౌకర్యం కోసం అక్కడ అండర్ పాస్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

హై స్కూల్‌కు వెళ్లాలంటే..

ధర్మవరం గ్రామానికి కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి అవతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉంది. ఈ హైస్కూల్లో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రస్తుతం 550 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరంతా ఉదయం, సాయంత్రం హైవేను దాటి వెళ్లాల్సివస్తోంది. ఈ క్రమంలో రహదారిపై వేగంగా ప్రయాణించే వాహనాల వద్ద తరచూ విద్యార్థు ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో ఒక విద్యార్థి లారీ ఢీకొనడంతో మృతి చెందాడు. దీంతో ప్రత్తిపాడు పోలీసులు హైవే వద్ద ఉదయం, సాయంత్రం విధులు నిర్వహిస్తూ విద్యార్థులను రోడ్డు దాటిస్తూ వారికి రక్షణగా నిలుస్తున్నారు.

అండర్ పాస్ వేరే చోట నిర్మించాలి

ఎంతో ప్రాధాన్యం కలిగిన హైస్కూల్ సెంటర్ వద్ద నిర్మించాల్సిన అండర్ పాస్ వంతెనను నాలుగులైన్ల రహదారిగా హైవేను అభివృద్ధి చేసిన హైవే అథారిటీ అధికారులు గ్రామ బైపాస్‌లోని సత్తెమ్మ తల్లి గుడి జంక్షన్ వద్ద నిర్మించారు. అక్కడ కూడా అండర్ పాస్ వంతెన తాటిపర్తి, ధర్మవరం గ్రామ ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని నిర్మించిన ఈ వంతెన పొలాలు వైపు నిర్మించడం వల్ల ఉపయోగం లేకుండా పోయింది. హైస్కూల్ వద్ద ప్రస్తుతం రాజానగరం జీఎస్ఎల్ ఆస్పత్రి ఎదురుగా నిర్మించిన వంతెన తరహాలో ఇక్కడ ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ హైవేను ఆరులైన్లుగా విస్తరిస్తున్న నేపథ్యంలో హైవే అథారిటీ వంతెన ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భయపడుతున్నాం



హైవే దాటితే కాని స్కూల్‌కు వెళ్లలేని పరిస్థితి మాది. స్కూల్‌కు వెళ్లేటప్పుడు హైవే దాటేటప్పుడు భయంతో నరకం చూస్తున్నాం. రోడ్డు దాటేటప్పుడు ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోననే భయపడుతూ రాకపోకలు సాగిస్తున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడ వంతెన నిర్మించాలి.

– గింజాల సత్య, పదో తరగతి విద్యార్థి

రక్షణ కల్పించండి



విద్యార్థుల అవస్థలను దృష్టిలో ఉంచుకొని హైవే అథారిటీ సిబ్బందికి పలు మార్లు విన్నవించుకున్నాం. అయినా పట్టించుకోవడంలేదు. హైవే అథారిటీ అధికారులు ఇక్కడ ఫ్లైఓవర్ లేదా అండర్ పాస్ వంతెన నిర్మించి విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి.

– శాంతి సుప్రియ, ప్రధానోపాధ్యాయిని, ధర్మవరం

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి


ఇళ్లనిర్మాణాలపై చర్చిస్తున్న హౌసింగ్ డీఈ వేణుగోపాలరావు

ఏలేశ్వరం: ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ రావుల వేణుగోపాలరావు అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఇళ్ల నిర్మాణాలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఇళ్లు ప్రారంభించని లబ్ధిదారులు వెంటనే పూర్తి చేయాలని, ప్రభుత్వం నగదుతో పాటు మెటీరియల్ కూడా అందజేస్తుందన్నారు. అనంతరం కమిషనర్ కొండలరావు, మేనేజర్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నేతలు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, తొండారపు రాంబాబులతో ఇళ్ల నిర్మాణాల వేగవంతంపై చర్చించారు. హౌసింగ్ ఏఈ కె.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్ ఆకస్మిక తనిఖీ

గండేపల్లి: మురారిలోని జగనన్న లేఅవుట్‌ను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల జెడ్పీ సీఈఓ ఎన్‌వీవీ సత్యనారాయణ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. సత్యనారాయణ మాట్లాడుతూ లేఅవుట్‌లో లబ్ధిదారులకు అందజేసిన 320 ఇంటి స్థలాలకు గాను 277 మంది లబ్ధిదారులకు రుణాలు మంజూరు కాగా వీటిలో 82 ఇళ్లు పూర్తయ్యాయని, 93 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మరో 102 స్థలాలలో ఇళ్ల నిర్మాణం ప్రారంభ దశలో ఉన్నట్టు తెలియజేశారు. అనంతరం వివిధ అంశాలపై వలంటీర్లకు అవగాహన కల్పించారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, ఉప సర్పంచ్ జాస్తి వసంత్, ఎంపీడీఓ రామన్, హౌసింగ్ ఏఈ రాంబాబు, విద్యుత్ ఏఈ సునీత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బలక్ష్మి, ఎన్ఆర్ఈజీఎస్ రమేష్, పంచాయతీ కార్యదర్శి పి.వీర శిరీష తదితరులు ఉన్నారు.

జగనన్న పాలవెల్లువపై రైతులకు అవగాహన


కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి చైతన్య

తొండంగి: బెండపూడిలో జగనన్న పాలవెల్లువ పథకంపై పాడిరైతులకు అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. గ్రామ సచివాలయంలో మండల పశువైద్యాధికారి బి.చైతన్య పాడి రైతులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించారు. రైతులు తమ పశువుల ద్వారా సేకరించిన పాలను ప్రభుత్వ పాలసేకరణ కేంద్రానికి పంపడం ద్వారా అధిక ధర కల్పించడంతోపాటు రుణాలు, రాయితీపై గడ్డి విత్తనాలు, పశువులకు దాణా వంటి అందిస్తుందన్నారు. రైతులంతా ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల యూత్ కన్వీనర్ ఆరుమిల్లి ఏసుబాబు, సర్పంచ్ ఏలేటి దుర్గాదేవి, పార్టీనాయకులు ఏలేటి ధర్మరాజు, ఎంపీటీసీలు గొంతెన దుర్గా నాగేశ్వరరావు, హరితేజ, తదితరులు ఉన్నారు.

రసాయనిక మందులతో పంటలకు నష్టం


పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న ఏఓ జోకా అమృత

కిర్లంపూడి: రైతులు తమ పొలాల్లో అధిక మోతాదులలో రసాయనిక మందులు వాడడం వల్ల పంటలకు నష్టం కలుగుతుందని ఏఓ జోకా అమృత అన్నారు. మండల పరిధి ముక్కొల్లు గ్రామం పాలూరి శ్రీను పొలంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటలో మిత్ర, శత్రుపురుగులు గుర్తించామన్నారు. అవగాహన రహితంగా మందులు వాడడం వల్ల పంటను నాశనం చేసే శత్రుపురుగులతో పాటు మిత్ర పురుగులు కూడా చనిపోయి పంట దిగుబడి తగ్గిపోతుందన్నారు. వ్యవసాయ సుత్రాలను పాటించడం ద్వారా అధిక దిగుబడితోపాటు నాణ్యమైన పంటలను సేద్యం చేయవచ్చునని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ రాజాల అబ్బాయి, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి రావికంపాడు రైల్వేగేటు మూసివేత

తొండంగి: రావికంపాడు రైల్వేగేటు ట్రాక్ మరమ్మతుల నిమిత్తం నాలుగు రోజుల పాటు మూసివేస్తున్నట్టు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. రావికంపాడు నుంచి అన్నవరం వెళ్లే రైల్వేట్రాక్ మరమ్మతుల పనులు జరుగుతున్నాయి. ఈ నెల 12 వరకూ గేటు మూసివేస్తున్నట్టు తెలిపారు. వాహనదారుల పి.ఇ.చిన్నాయపాలెం రైల్వేగేటు మీదుగా వెళ్లాలని కోరారు.

వార్డు సభ్యుల ఎన్నికలకు ఓటరు లిస్టు సిద్ధం

రౌతులపూడి: మండలంలో ఎ.మల్లవరం, ఎం.కొత్తూరు, జల్దాం గ్రామాల్లో ఖాళీ అయిన పంచాయతీ వార్డు సభ్యుల ఎన్నికలకు ఓటరు లిస్టులు సిద్ధం చేస్తున్నట్టు ఎంపీడీఓ ఎం.గోవింద్ తెలిపారు. ఆయా గ్రామాల్లో వార్డు సభ్యులు అకాల మృతితో ఖాళీ అయిన కారణంగా ఆయా సభ్యుల స్థానాలకు మళ్లీ ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సంబంధిత పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఓటరు లిస్టు ఎంపిక చేసే చర్యలు చేపట్టామని ఆయన అన్నారు.

ఎరియర్స్ మంజూరు చేయాలి

ప్రత్తిపాడు: రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగులకు ఇవ్వవలసిన పెండింగ్ పీఆర్సీ, డీఆర్ ఎరియర్స్ మంజూరు చేయాలని విశ్రాంత ఉద్యోగుల సమావేశం కోరింది. ప్రత్తిపాడు సబ్ ట్రెజరీ కార్యాలయ ఆవరణలో బుధవారం మండల విశ్రాంత ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన విశ్రాంత ఎంఈఓ ముక్కు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఫిబ్రవరి 28వ తేదీ లోగా విశ్రాంత ఉద్యోగులంతా లైఫ్ సర్టిఫికెట్లను అందజేయడమే కాకుండా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సుబ్రహ్మణ్యం కోరారు. నాయకులు బర్రే కోటేశ్వరరావు, బేతా సత్యనారాయణ, డి.సీతారాం, బొడ్డేటి ఆదిరాజు, జంధ్యం సుబ్బారావు, శేషగిరిరావు, వై.రామం తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు


ఏలేశ్వరంలో ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న ఏడీ దైవకుమార్

ఏలేశ్వరం: ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని పెద్దాపురం వ్యవసాయశాఖ ఏడీ ఎస్.దైవకుమార్ అన్నారు. అంతర్గత తనిఖీలో భాగంగా మండలంలోని పలు ఎరువుల దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ దాళ్వాను దృష్టిలో పెట్టుకొని రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. యూరియా అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. ధరలను ఎప్పటికప్పుడు షాపుల వద్ద ధరల పట్టికలో చూపాలన్నారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులు విధిగా రసీదులు తీసుకోవాలన్నారు. ఎరువుల అమ్మకాల్లో అవకతవకలు జరిగితే వెంటనే తమ సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం షాపుల స్టాకు రిజిస్టర్లను, గోడౌన్‌ల్లో స్టాకును పరిశీలించారు. ఆయన వెంట ఏఓ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

తుని: ప్రభుత్వం రైతుల కోసం రాయితీ ఇస్తున్న ఎరువుల నాణ్యత, ధర, స్టాకు తదితర వాటిపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలో ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ చేసినట్టు జగ్గంపేట ఏడీఏ గంగాధర్ తెలిపారు. స్థానిక అధికారులతో కాకుండా వేరే అధికారులతో తనిఖీలు చేయడం వ్యాపారుల్లో ఆందోళన వ్యక్తమైంది. మండల వ్యవసాయాధికారి అశోక్ కుమార్ పాల్గొన్నార

అన్నవరం ట్రస్ట్‌బోర్డు సభ్యుడికి సత్కారం


చిట్టిబాబును సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రత్తిపాడు: అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం పాలక వర్గ సభ్యునిగా నియమితులైన దళే వీర సూర్యనారాయణ అనే చిట్టిబాబును బుధవారం సాయంత్రం పలువురు సత్కరించారు. పెదశంకర్లపూడిలోని ఆయన స్వగృహంలో మండల వైఎస్సార్ సీపీ నాయకుడు రామిశెట్టి చినబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు రామిశెట్టి బులి రామకృష్ణ, మామిడి నరసింహమూర్తి తదితరులు శాలువాలను కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ప్రత్తిపాడు జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, ఎంపీపీ గొల్ల కాంతి సుధాకర్, ధర్మవరం, లంపకలోవ సొసైటీ అధ్యక్షుడు చెక్కపల్లి సత్తిబాబు, గొంతిన సురేష్ తదితరులు దళే చిట్టిబాబును అభినందించారు.

క్రీడలపై యువతకు ఆసక్తి అవసరం

పెద్దాపురం: గ్రామీణ యువత క్రీడలపై ఆసక్తిని కనపర్చాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేటుకూరి సూర్యనారాయణ రాజు అన్నారు. మండలంలోని తిరుపతి పార్టీ యువమోర్చ ఉపాధ్యక్షుడు మొయిళ్ల రవి ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా పీఎం నరేంద్రమోడీ జిల్లా స్థాయి కబడ్డీ టోర్నీ విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ మోదీ పిలుపు మేరకు టోర్నీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం తిరుపతి, సామర్లకోట, కొత్తూరు, మల్లిసాల గ్రామాల కబడ్డీ జట్లకు మొదటి నాలుగు స్థానాలకు బహుమతులు అందజేశారు.

ఏఎన్‌ఎం పోస్టుల భర్తీకి చర్యలు

సామర్లకోట: జిల్లా పరిధిలో అర్బన్ హెల్త్ సెంటర్లలో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నట్టు డీఎంహెచ్ఓ డి.శాంతిప్రభ తెలిపారు. బుధవారం స్థానిక గణపతినగరం, అయోధ్యరామపురంలోని అర్బన్ హెల్త్ సెంటర్లను ఆమె తనిఖీ చేశారు. ఈ మేరకు ప్రతి బుధవారం చిన్నారులకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలను ఆమె పరిశీలించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుఖ ప్రసవాలు జరిగేలా దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు చెప్పారు. గర్భిణులు, చిన్నారులకు నూరు శాతం టీకాలు వేసి, మందులు ఇచ్చి వాడించాలన్నారు. మా ఆస్పత్రి అనే నమ్మకంతో ప్రజలు వచ్చేలా సిబ్బంది విధులు నిర్వర్తించాలన్నారు. అయోధ్యరామపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో సదుపాయాలు, మందులు సమృద్ధిగా ఉన్నా సిబ్బంది కొరత వల్ల రోగులు ఇబ్బంది పడుతున్నారని 31వ వార్డు కౌన్సిలర్ పాగా సురేష్ కుమార్ డీఎంహెచ్ఓకు వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఒకేసారి సిబ్బంది నియమాకం ఉంటుందని చెప్పారు.

అనధికార విద్యుత్ కోతలతో తప్పని అవస్థలు

కోటనందూరు: గ్రామాల్లో విధిస్తున్న అనధికార విద్యుత్ కోతలతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం 24 గంటలూ నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తుంటే స్థానిక సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పల్లెల్లో తరచూ విద్యుత్ కోతలు విధిస్తున్నారు. సిబ్బంది లైన్‌కట్(ఎల్సీ)లు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా వాటిని పునరుద్ధరిస్తున్నారు. మరో పక్క గ్రామాల్లో పని చేసే ఎలక్ట్రీషియన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించి ఏబీ స్విచ్‌ల సహకారంతో విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నారు. గ్రామస్థాయిలో విధించిన విద్యుత్ కోతలు కనీసం మండలస్థాయి అధికారులకు తెలిసే పరిస్థితి ఉండడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ కోతలకు సంబంధించి షిఫ్ట్ ఆపరేటర్ల నుంచి సరైన సమాచారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు సమయం పొడిగించాలి


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు

కిర్లంపూడి: ఖరీఫ్ ధాన్యం కొనుగోలు సమయం పొడిగించాలని భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యల్లపు సూర్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల పదో తేదీతో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు నిలిపివేయమని రైతు భరోసా కేంద్రాల్లో చెప్పారని, రబీ పంటలు, అపరాలు, వరి వేయడం వల్ల దారి మార్గం లేక పొలాల్లో సగానికి పైగా వరి కుప్పలు ఉన్నాయన్నారు. మార్చి నెలలో పంటలు ఒబ్బిడి అవుతాయని, ఏప్రిల్ నెలాఖరు వరకు ధాన్యం కొనుగోలు సమయం పొడిగించాలన్నారు. సర్వే చట్టంలో తెలిపిన విధంగా ముందుగా రైతులకు నోటీసులు ఇచ్చి, తర్వాత భూ–రీసర్వే నిర్వహించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాసంశెట్టి రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లు శివరామకృష్ణ, మండల అధ్యక్షుడు రాపేటి శ్రీనివాసరావు, గోకాడ కుమార్ రాజా పలువురు రైతులు ఉన్నారు.

లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం

కొత్తపల్లి: వాకతిప్పలో ఉన్న శ్రీలక్ష్మీగణపతి ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన చేశారు.

రేపటి నుంచి బషీర్ బీబీ ఉర్స్ ఉత్సవాలు

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి


బషీర్ బీబీ దర్గా

కొత్తపల్లి: పొన్నాడలో వేంచేసి ఉన్న బషీర్‌బీబీ ఔలియా(బంగారు పాపమ్మ) 68వ ఉర్స్ ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఉత్సవాలకు స్థానిక ముజావర్లు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు. ఈ ఉత్సవాలు ఆదివారం వరకూ నిర్వహించనున్నారు. శుక్రవారం ఈ ఉత్సవాలును ప్రజాప్రతినిధులు ప్రారంభిస్తారన్నారు. ఈ ఆలయానికి రాష్ట్రం నలుమూలల నుంచి హిందూ, ముస్లింలు హాజరవుతారు. మూడు రోజుల పాటు ఉండేందుకు వీలుగా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పిఠాపురం సీఐ ఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొత్తపల్లి, పిఠాపురం, పిఠాపురం రూరల్, గొల్లప్రోలు పోలీసులు మూడురోజుల పాటు ఎస్సై రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో బందోబస్తు ఉంటుందన్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, రంగులతో సుందరంగా అలంకరించారు.

శ్రీవారి పుష్కరిణి ప్రారంభానికి సిద్ధం


ఎస్.అన్నవరంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న శ్రీవారి పుష్కరిణి

- పరివార దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ
- 24 నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి పుష్కరిణి(లక్ష్మీదేవి కోనేరు) ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. తుని పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్మాణ పనులు పూర్తవడంతో మార్చి ఒకటో తేదీన రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, లక్ష్మీ చైతన్య దంపతులచే శ్రీవారి పుష్కరిణి ప్రారంభించనున్నారు. అంనతరం మహాలక్ష్మీ, పాండురంగ, వరహా, హయగ్రీవ, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నారు. స్వామీజీలతో వివిధ పుణ్యనదుల నుంచి సేకరించిన జలాలతో పుష్కరిణి ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ఈనెల 23న భక్తులు గోవిందమాల దీక్షధారణ చేసి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 24వ తేదీ నుంచి 28 వరకూ ప్రత్యేక పూజలు, మార్చి ఒకటిన పుష్కరిణి ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి, కుంభద్వాసన, చక్రస్నానం, అన్నసమారాధన, పుష్కరిణి హారతి, శాంతి కల్యాణ మహోత్సవాలు ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యే వెంటే మేమంతా

- అన్నవరం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు సూర్యావతి

పిఠాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు వెంటే తామంతా ఉంటామని అన్నవరం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలిగా నియమితులైన రాయుడు సూర్యావతి అన్నారు. ఆమెను ట్రస్ట్‌బోర్డు సభ్యురాలుగా నియమించినందుకు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబును కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొరబాబు మాట్లాడుతూ పార్టీకి కట్టుబడి పనిచేసే ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. రాయుడు చిన్న, ఉలవల భూషణం తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

సామర్లకోట: స్థానిక పాత్రులపేటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. ఈ మేరకు ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.6,750 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. సీఐ ఆధ్వర్యం లో జరిగిన దాడుల్లో ఎస్సై టి.సునీత, సిబ్బంది పాల్గొన్నారు.